విద్యుత్ శాఖలో ఇంజినీర్ల కొరత

- పదహైదు మండలాలు .. ఆరుగురు ఏఈలు
- నాణ్యమైన విద్యుత్ సరఫరా కోసం తంటాలు
- తరచూ వెలుగుచూస్తున్న విద్యుత్ సమస్యలు
- ఆందోళనలు చేస్తున్న రైతులు
- ప్రస్తుత బదిలీల్లోనైనా న్యాయం చేకూరేనా?



రాయదుర్గం: విద్యుత్‌శాఖలో ఇంజనీరింగ్ అధికారుల (ఏఈ) కొరత వేధిస్తోంది. ఫలితంగా నిరంతరం నాణ్యమైన విద్యుత్ సరఫరాలో అంతరాయం కలుగుతోంది. వర్షం కురిసిందంటే పల్లె, పట్టణాలు చీకట్లో మగ్గాల్సి వస్తోంది. పర్యవేక్షించాల్సిన కీలక అధికారుల కుర్చీలన్నీ..ఖాళీగా దర్శనమిస్తున్నాయి. దీంతో క్షేత్రస్థాయి సిబ్బంది బాధ్యతా రాహిత్యంగా వ్యవహరిస్తున్నారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకొచ్చి వంద రోజులు గడవక ముందే అప్రకటిత విద్యుత్ కోతలతో రైతులు అల్లాడుతున్నారు. అక్కడక్కడ పంటలు దెబ్బతిన్నాయి.

రాయదుర్గం, బ్రహ్మసముద్రం, గుమ్మఘట్ట మండలాల రైతులు నాణ్యమైన విద్యుత్ కోసం రోడ్డెక్కి ఆందోళనలు చేశారు. తరచూ విద్యుత్ లైన్లలోనూ సమస్యలు ఉత్పన్నం అవుతున్నాయి. కొత్త కనెక్షన్లు, ట్రాన్స్‌ఫార్మర్ల మంజూరు కోసం రైతులు కార్యాలయాల చుట్టూ ప్రదక్షిణలు చేస్తున్నారు. సాధారణ ఎన్నికలకు ముందు కొరతలేకుండా ఉద్యోగులు ఉండేవారు. సచివాలయాల్లో ఉద్యోగుల సేవలు వినియోగిస్తూ నాణ్యమైన విద్యుత్ సరఫరాకు గత ప్రభుత్వం పెద్దపీట వేసింది. ఆ తర్వాత పలు కారణాలు వెరసి బదిలీలు ఎక్కువయ్యాయి. నేటికీ భర్తీకాక వినియోగదారులు, రైతులు అనేక ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు.

తొమ్మిది మండలాలకు ఏఈల కొరత ..

రాయదుర్గం, కళ్యాణదుర్గం, ఉరవకొండ విద్యుత్ సబ్ డివిజన్ పరిధిలోని 3 పట్టణాలు, 15 మండలాల్లో 76,140 వ్యవసాయ, సుమారు 1,81,364 గృహాలు, పరిశ్రమలకు చెందిన విద్యుత్ కనెక్షన్లు ఉన్నాయి. రాయదుర్గంలో ఏడీతో పాటు ఐదు మండలాలకు ఏఈ పోస్టులన్నీ ఖాళీగా ఉన్నాయి. సబ్ ఇంజనీర్లే ఆ భారాన్ని మోస్తూ రాత్రి, పగలు నరకయాతన అనుభవిస్తున్నారు. బ్రహ్మసముద్రం, కుందుర్పి, కంబదూరు, ఉరవకొండ మండలాల్లోనూ ఏఈ పోస్టులు ఖాళీగా ఉన్నాయి. ఇక్కడ కిందిస్థాయి సిబ్బందితోనే నెట్టుకొస్తున్నారు. ఫలితంగా విద్యుత్‌శాఖ పూర్తి గాడితప్పింది. పర్యవేక్షణ కాస్త గాలికొదిలారు. తొమ్మిది గంటలంటే కొన్నిచోట్ల ఏడు గంటలు కూడా సరఫరా కాని పరిస్థితి.

ఉరవకొండ, రాయదుర్గం, కళ్యాణదుర్గం నియోజకవర్గాల్లో విద్యుత్ కనెక్షన్ల వివరాలు..

నియోజకవర్గం	సబ్‌స్టేషన్లు	వ్యవసాయ కనెక్షన్లు	గృహ వాణిజ్య కనెక్షన్లు
ఉరవకొండ	11	12,500	53,148
కళ్యాణదుర్గం	17	32,868	64,012
రాయదుర్గం	22	31,042	64,204

విద్యుత్ రంగంలో విప్లవాత్మక సంస్కరణలు

గత వైఎస్సార్‌సీపీ హయాంలో వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి విద్యుత్ రంగంలో విప్లవాత్మక సంస్కరణలు తీసుకొచ్చారు. వ్యవసాయం, పరిశ్రమలు, గృహ అవసరాలకు ఇబ్బందుల్లేకుండా నాణ్యమైన కరెంటు సరఫరా జరిగేలా చూశారు. అవసరాలకు తగ్గట్టుగా కొత్త సబ్‌స్టేషన్ల నిర్మాణానికి చర్యలు చేపట్టారు. అప్రకటిత విద్యుత్ కోతలు, లోఓల్టేజీ సమస్యల్లేకుండా శాశ్వత పరిష్కార మార్గం చూపారు. రైతులకు క్రమం తప్పకుండా పగటిపూట 9 గంటలు విద్యుత్ అందించారు. మూడు నియోజకవర్గాల్లోనూ 50 సబ్‌స్టేషన్లు ఉంటే అదనంగా మరో 25 కొత్త సబ్‌స్టేషన్లు మంజూరు చేసి రైతులు, వాణిజ్య, గృహ అవసరాలు తీర్చేలా కృషి చేశారు. దాన్ని పరిరక్షించి బాధ్యతగా సరఫరా చేసేందుకు సిబ్బంది కొరత కొట్టొచ్చినట్టు కనిపిస్తోంది. ఈ నేపథ్యంలో అప్రకటిత కోతలు అక్కడక్కడ మొదలయ్యాయి. ప్రస్తుత బదిలీల్లో ఆ లోటు తీర్చాలని రైతులు, వినియోగదారులుముక్తకంఠంతో కోరుతున్నారు.

ఇబ్బందుల్లేకుండా విద్యుత్ సరఫరా చేస్తున్నాం



విద్యుత్ సబ్ డివిజన్‌లోని ఒక ఏడీ, తొమ్మిది ఏఈ పోస్టులు ఖాళీగా ఉన్నాయి. ఎక్కడా సమస్యలు తలెత్తకుండా విద్యుత్ సరఫరా చేస్తున్నాం. ఉన్న సిబ్బందినే సర్దుబాటు చేశాం. విషయాన్ని ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లాం. ప్రస్తుత బదిలీల్లో కొందరిని నియమించే అవకాశం ఉంది. ప్రస్తుతం విద్యుత్ కోతలు ఎక్కడా ఉత్పన్నం కాలేదు.

– శేషాద్రిశేఖర్, విద్యుత్‌శాఖ ఈఈ, కళ్యాణదుర్గం

గ్రామాల్లో ఘనంగా మారెమ్మ జాతర





బ్రహ్మసముద్రం,కణేకల్లులో పూజలందుకున్న మారెమ్మదేవత, వడ్డేపాళ్యంలో గ్రామోత్సవం చేస్తున్న దృశ్యం

కుందుర్పి: మండలంలోని 10 గ్రామాల్లో మంగళవారం ఘనంగా మారెమ్మ జాతర నిర్వహించారు. మలయనూరు, నాగేపల్లి, నిజవళ్లి, మాయదార్లపల్లి, ఏళ్లచింత, శ్రీమజ్జనపల్లి, బొమ్మాజిపల్లి, తమ్మయ్యదొడ్డి, వడ్డేపాళ్యం తదితర గ్రామాల్లో మారెమ్మ జాతర నిర్వహించారు. మంగళవారం మధ్యాహ్నం ఆయా గ్రామాల్లో భక్తులు బోనాలతో గ్రామోత్సవంగా వెళ్లి మారెమ్మ ఆలయాల్లో ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం గ్రామ శాంతి చేశారు. కర్ణాటక నుంచి భక్తులు ఆయా గ్రామాలకు పెద్ద సంఖ్యలో వచ్చి మొక్కులు తీర్చుకున్నారు.

కణేకల్లు: మండలంలోని వివిధ గ్రామాల్లో మారెమ్మ జాతర మంగళవారం ఘనంగా జరిగింది. కణేకల్లు క్రాస్, యర్రగుంట, 43 ఉడేగోళం గ్రామాల్లో ప్రజలు మారెమ్మ జాతరను భక్తిశ్రద్ధలతో జరుపుకున్నారు. ఆయా గ్రామాల్లోని గ్రామదేవతలకు ప్రత్యేక పూజలు నిర్వహించారు. కణేకల్లు క్రాస్, యర్రగుంట గ్రామంలోని మారెమ్మదేవి ఆలయంలో అమ్మవారికి కుంకుమార్చన, పంచామృతాభిషేకం, ఆకు పూజలు నిర్వహించారు. భక్తులు అమ్మవారికి దర్శించుకొని మొక్కుబడులను తీర్చుకున్నారు.

బ్రహ్మసముద్రం : మండలంలోని ముప్పలకుంట, చెలిమేపల్లి గ్రామాల్లో మారెమ్మ జాతరను గ్రామస్తులు మంగళవారం ఘనంగా నిర్వహించారు. అమ్మవారి ఆలయంలో ఉదయం నుంచి అభిషేకం , ఆకుపూజ తదితర విశేష పూజలు చేశారు. అనంతరం భక్తులు అమ్మవారికి భోనాలు సమర్పించి, వేప చీరలు కట్టి, జంతుబలి ఇచ్చారు.

నిమజ్జనానికి తరలిన గణనాథులు



విడపనకల్లులో వినాయక విగ్రహాన్ని నిమజ్జనానికి తరలిస్తున్న భక్తులు



కంబదూరులో వినాయక నిమజ్జనాన్ని పర్యవేక్షిస్తున్న డీటీ నారాయణస్వామి, ఎస్‌ఐ ఆంజనేయులు

కంబదూరు: వినాయక చవితి పర్వదినాన్ని పురస్కరించుకుని వాడవాడలా కొలువుదీరిన గణనాథులు నాలుగో రోజు మంగళవారం నిమజ్జనానికి తరలివెళ్లాయి. సాయంత్రం డిప్యూటీ తహసీల్దార్ నారాయణస్వామి, ఎస్‌ఐ ఆంజనేయులు సూచనల మేరకు అన్ని గ్రామాల్లోనూ వినాయక నిమజ్జనం చేశారు. ఎలాంటి సంఘటనలు చోటు చేసుకోకుండా ఎస్‌ఐ ఆంజనేయులు బందోబస్తును ఏర్పాటు చేశారు.

ఘనంగా వినాయక నిమజ్జనం

విడపనకల్లు: మండలంలోని పాల్తూరు, విడపనకల్లు, హావలిగి గ్రామాల్లో మంగళవారం వినాయక నిమజ్జనం ఘనంగా చేశారు. వినాయక విగ్రహాలను గ్రామాల్లో ఊరేగించారు. అనంతరం గుంతకల్లు బ్రాంచి కెనాల్ (జీబీసీ)లో నిమజ్జనం చేశారు.

వినాయక మంటపాల వద్ద అన్నదానం

రాయదుర్గంటౌన్: పట్టణంలోని పలు ప్రాంతాల్లో కొలువుదీరిన మంటపాల్లో మంగళవారం అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. పట్టణంలోని లక్ష్మీబజార్ ఎస్‌బీఐ ఏటీఎం వద్దనున్న వినాయక భక్త మండలి, 5వ వార్డులోని గాజుల వీధిలోని అశ్వత్ వినాయక అసోసియేషన్, తేరుబజారు వద్ద నున్న వినాయక మంటపాల్లో అన్నదాన కార్యక్రమాలు జరిగాయి. గాజులవీధి, తేరుబజారు వినాయక మంటపాల వద్ద జరిగిన అన్నదానానికి ఎమ్మెల్యే కాలవ శ్రీనివాసులు హాజరై ప్రారంభించారు. లక్ష్మీబజార్‌లోని వినాయక భక్తమండలి ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యక్రమాన్ని వైఎస్సార్‌సీపీ రైతు విభాగం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి గౌని ఉపేంద్రరెడ్డి ప్రారంభించారు.

బాబు వైఫల్యంతోనే విజయవాడ ప్రళయం

- వైఎస్సార్‌సీపీ రాయదుర్గం సమన్వయకర్త మెట్టు గోవిందరెడ్డి



మెట్టు గోవిందరెడ్డి, సమన్వయకర్త, రాయదుర్గం



రాయదుర్గం: కూటమి ప్రభుత్వ వైఫల్యం, చంద్రబాబు అసమర్థత వల్లే విజయవాడ జల ప్రళయంలో చిక్కుకుందని రాయదుర్గం వైఎస్సార్‌సీపీ సమన్వయకర్త, మాజీ ఎమ్మెల్యే మెట్టు గోవిందరెడ్డి విమర్శించారు. మంగళవారం ఆయన తన స్వగృహంలో మాట్లాడారు.. ఉండవల్లి కరకట్ట లోపల సీఎం చంద్రబాబు నివాసం, వేమూరి రాధాకృష్ణ పవర్‌ప్లాంట్ కాపాడేందుకే బుడమేరును మళ్లించి, పేదల బతుకులపై నీళ్లుచల్లారన్నారు. వాతావరణశాఖ ముందస్తుగా హెచ్చరించినా విజయవాడ ప్రజలను అప్రమత్తం చేయడంలో కూటమి ప్రభుత్వం నిర్లక్ష్యం చేసిందన్నారు. రెప్పపాటులోనే భారీ ప్రాణ, ఆస్తి నష్టం సంభవించిదన్నారు. ఇది ముమ్మాటికీ ప్రభుత్వ వైఫల్యమేనని మండిపడ్డారు. 50 మందికి పైగా జల సమాధికాగా, నేటికీ అనేక కాలనీలో బురదలోనే చిక్కుకున్నాయని, పేదల ఉసురు ఊరుకే పోదన్నారు. సహాయక చర్యల్లోనూ వెనుకబాటుతనమే కనిపిస్తోందన్నారు. ప్రజాగ్రహానికి గురికాక తప్పదని హెచ్చరించారు. కూటమి ప్రభుత్వం ఎన్ని డ్రామాలు చేసినా విజయవాడ ప్రజలు నమ్మే పరిస్థితి లేదన్నారు.

అండగా నిలిచిన జగన్

వైఎస్సార్‌సీపీ అధినేత వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి వరద బాధితులకు అండగా నిలిచారని మెట్టు గోవిందరెడ్డి అన్నారు. వరద ప్రాంతాల్లో పర్యటించాక పార్టీ ఆధ్వర్యంలో పెద్ద ఎత్తున సహాయక చర్యలు చేపట్టారని గుర్తు చేశారు. తక్షణ సాయంగా రూ.కోటి తో పాటు లక్ష పాల ప్యాకెట్లు, 2 లక్షల వాటర్ బాటిళ్లు పంపిణీ చేసి మానవత్వం చాటుకున్నారన్నారు. ప్రభుత్వానిది ప్రచార ఆర్భాటం మాత్రమేనని ఆగ్రహం వ్యక్తం చేశారు. వైఎస్సార్‌సీపీ అధికారంలో ఉండి ఉంటే వలంటీర్లు సైనికులుగా పని చేసేవారని గుర్తు చేశారు. పార్టీ ఆదేశాల మేరకు తమ వంతు సహకారం అందిస్తామన్నారు.

9 గంటల్లో 11 ఎకరాల్లో గుంటక పాసిన రైతు

వజ్రకరూరు:మండలంలోని కమలపాడు గ్రామానికి చెందిన రైతు గొరువ మహేష్ అరుదైన రికార్డు సృష్టించాడు. కేవలం తొమ్మిది గంటల్లో 11 ఎకరాలు బదుగు గుంటుకతో పొలాన్ని పాసి అందరిచేత శభాష్ అనిపించుకున్నాడు. మంగళవారం తెల్లవారుజాము 4 గంటలకు మొదలు పెట్టిన పనిని మధ్యాహ్నం 12 గంటలకు పూర్తి చేయడంతో గ్రామస్తులు అభినందిస్తూ మహేష్‌తో పాటు ఆయన ఎద్దులనూ ఊరేగించారు. సాధారణంగా ఈ ప్రక్రియ పూర్తి చేయడానికి మూడు నుంచి నాలుగు రోజుల సమయం పడుతుందని ఈ సందర్భంగా గ్రామస్తులు తెలిపారు.



కమలపాడు రైతు గొరువ మహేష్‌ను అభినందిస్తున్న దృశ్యం

ఇళ్ల మధ్య మురుగుగుంట

కూడేరు: మండల కేంద్రంలోని ట్రాన్స్‌కో కార్యాలయం వద్ద అనంతపురం-బళ్లారి ప్రధాన రహదారి పక్కన ఏర్పాటు చేసిన డ్రైనేజీ నుంచి మురుగు ప్రవహిస్తోంది. నివాస గృహాల ముందర రహదారి పొడవునా మురుగు నీరు నిల్వ ఉండి, దుర్వాసన వస్తోంది. దీంతోపాటు దోమలు వృద్ధి చెందుతున్నాయి. దోమకాటుకు గురై ప్రజలు రోగాల బారిన పడాల్సి వస్తోంది.



ట్రాన్స్‌కో కార్యాలయం వద్ద డ్రైనేజీ నుంచి నీరు బయటకు వచ్చి నిల్వ ఉన్న దృశ్యం

గూడ్స్ రైలు ఢీకొని మూడు పశువుల మృతి

రాయదుర్గంటౌన్: పట్టణంలోని అనంతపురం రోడ్డులోని రైల్వేగేటు ట్రాక్‌పై గూడ్స్ రైలు ఢీకొని మూడు పశువులు మృతి చెందాయి. ఈ ఘటన మంగళవారం రాత్రి 9.30 గంటలకు జరిగింది. గూడ్స్ రైలు రాకతో గేటు వేసిన క్రమంలో అదే సమయంలో మూడు పశువులు గేటు దాటుతున్నాయి. దీన్ని గమనించిన గేట్ ఆపరేటర్ వాటిని తరిమివేసేందుకు ప్రయత్నించినా ఫలితం లేకుండాపోయింది. వేగంగా వచ్చిన గూడ్స్ రైలు కింద పడి పశువులు మృతి చెందాయి. పశువులు నుజ్జునుజ్జయ్యాయి.

జాతీయ లోక్ అదాలత్‌ను సద్వినియోగం చేసుకోవాలి

రాయదుర్గంటౌన్: జాతీయ లోక్ అదాలత్‌ను కక్షిదారులు సద్వినియోగం చేసుకోవాలని, రాజీ మార్గంతో కేసులను పరిష్కరించుకోవాలని న్యాయ సేవా అధికార సంస్థ చైర్మన్, జూనియర్ సివిల్ జడ్జి ఎం.రమ్య మంగళవారం ఓ ప్రకటనలో తెలిపారు. ఈ నెల 14న ఉదయం 10:30 గంటలకు కోర్టులో జాతీయ లోక్ అదాలత్ నిర్వహిస్తున్నట్లు జడ్జి తెలిపారు.

ఈశ్వరుడి ఆలయంలో చోరీ

గుమ్మఘట్ట: భూపసముద్రంలోని ఈశ్వరుడి ఆలయంలో సోమవారం అర్ధరాత్రి గుర్తు తెలియని వ్యక్తులు హుండీని ధ్వంసం చేసి, నగదు ఎత్తుకెళ్లారు. దీనిపై పోలీసులకు ఫిర్యాదు చేయనున్నట్లు గ్రామస్తులు తెలిపారు.

నేడు వాహనాల వేలం

శెట్టూరు: మండలంలోని పోలీస్ స్టేషన్ పరిధిలో అక్రమ మద్యం కేసుల్లో పట్టుబడిన వాహనాలను వేలం వేయనున్నట్లు ఎస్‌ఐ రాంభూపాల్ తెలిపారు. బుధవారం పోలీస్ స్టేషన్ ఆవరణలో వేలం నిర్వహిస్తామన్నారు. 6 ద్విచక్ర వాహనాలు వేలం వేయనున్నట్లు తెలిపారు. వేలం పాటలో పాల్గొనదల్చుకున్న వారు రూ.1000 రుసుం చెల్లించాలన్నారు.

సంక్షిప్త సమాచారం

హెచ్ఐవీ బాధితులపై వివక్ష తగదు



మాట్లాడుతున్న వైద్యాధికారి తేజశ్వి

వజ్రకరూరు: హెచ్ఐవీ బాధితులపై వివక్ష తగదని వజ్రకరూరు వైద్యాధికారి తేజశ్వి, లింక్ వర్కర్ డీవీ నాగరాజు తదితరులు తెలిపారు. మంగళవారం మండల కేంద్రంలోని ప్రభుత్వాస్పత్రిలో జిల్లా హెచ్ఐవీ ఎయిడ్స్ నివారణ, నియంత్రణ మండలి ఆధ్వర్యంలో చైల్డ్ ఫండ్ ఇండియా లింక్ వర్కర్ స్కీమ్ ఆధ్వర్యంలో మీకు తెలుసా? ఐఈసీ ప్రోగ్రాం హెచ్ఐవీ ఎయిడ్స్ నివారణపై అవగామన కల్పించారు. లింక్‌వర్కర్ నాగరాజు, ఎంఈహెచ్ఈఓ గురుప్రసాద్, హెల్త్ ఎడ్యుకేటర్ సత్యనారాయణ, సూపర్‌వైజర్ నాగశంకర్, వైద్యసిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

పెట్టుబడి సాయం అందించాలి

వజ్రకరూరు: అన్నదాత సుఖీభవ పెట్టుబడి సాయం అందించాలని ఏపీ రైతు సంఘం జిల్లా ఉపాధ్యక్షుడు విరూపాక్షి ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. మంగళవారం కొనకొండ్ల, గూళ్యపాళ్యం గ్రామాల్లోని గ్రామ సచి వాలయాల్లో ఏపీ రైతు సంఘం నాయకులు విన తి పత్రాలు అందించారు. రైతు సంఘం నాయకులు సుధాకర్, సత్యప్రకాష్,షెక్షావలి, బాషా పాల్గొన్నారు.

14,15తేదీల్లో జేవీవీ రాష్ట్ర మహాసభలు

కళ్యాణదుర్గం రూరల్: అనంతపురంలో ఈనెల 14,15 తేదీల్లో జరిగే జన విజ్ఞాన వేదిన రాష్ట మహా సభలను జయప్రదం చేయాలని జేవీవీ రాష్ట్ర నాయకుడు మరళీధర్ తెలిపారు. మంగళవారం పట్టణంలోని నార్త్ స్కూల్‌ల్లో జన విజ్ఞాన వేదిక రాష్ట్ర మహాసభల కరపత్రాలు విడుదల చేశారు. కార్యక్రమంలో రాష్ట్ర జేవీవీ ఆడిట్ కమిటీ సభ్యుడు భాస్కర్, జిల్లా గౌరవాధ్యక్షుడు మల్లికార్జున, చల్లా కిరణ్, నాగరాజు తదితరులు పాల్గొన్నారు.

క్లుప్తంగా

పాఠశాలలను తనిఖీ చేసిన డీవైఈఓ



నార్త్‌స్కూల్లో రికార్డులను పరిశీలిస్తున్న డీవైఈఓ శ్రీనివాసురావు, అధికారులు

కళ్యాణదుర్గం రూరల్: పట్టణంలోని నార్త్ ప్రైమరీ, శ్రీవివేకనందా, నారాయణ, దురకుంట పాఠశాలలను డీవైఈఓ శ్రీనివాసురావు మంగళవారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. పాఠశాలల్లోని విద్యార్థుల వసతులను పరిశీలించారు. నింబంధనలకు విరుద్ధంగా పాఠశాలలను నిర్వహిస్తే, కఠిన చర్యలు తప్పవన్నారు. కార్యక్రమంలో ఎంఈఓ విజయ్‌కుమారి, బాబు పాల్గొన్నారు.

పంటల బీమాపై పట్టించుకోరా?

కుందుర్పి: కూటమి ప్రభుత్వం 2023 ఖరీఫ్ పంటల బీమాపై పట్టించుకోలేదని రైతు సంఘం నాయకులు లక్ష్మీపతి, అతావుల్లా, తిప్పేస్వామి, హనుమంతప్ప, బలదేవ్, రామచంద్రప్ప తదితరులు అన్నారు. మంగళవారం వారు విలేకరులతో మాట్లాడారు. వైఎస్సార్ సీపీ హయాంలో ఏటా జూన్ మాసంలోనే పంటల బీమా అందేదని, నగదు రైతుల ఖాతాల్లో జమ అయ్యేదన్నారు. రైతు సమస్యలను దృష్టిలో ఉంచుకొని ప్రభుత్వం పంటల బీమా నిధులను విడుదల చేయాలని వారు కోరారు.

కర్ణాటక మద్యం విక్రేత అరెస్ట్

కంబదూరు: కురాకులపల్లిలో కర్ణాటక మద్యాన్ని విక్రయిస్తున్న వ్యక్తిని కంబదూరు పోలీసులు మంగళవారం అరెస్ట్ చేశారు. గ్రామంలో పెద్దన్న అనే వ్యక్తి కర్ణాటక మద్యం విక్రయిస్తున్నట్లు ఎస్ఐ ఆంజనేయులుకు సమాచారం అందింది. తన సిబ్బందితో వెళ్లి మద్యం విక్రేతను అరెస్ట్ చేసి, 96 కర్ణాటక మద్యం ప్యాకెట్లను స్వాధీనం చేసుకున్నారు. హెడ్‌కానిస్టేబుల్ జాఫర్, సిబ్బంది పాల్గొన్నారు.

ఘనంగా వీరభద్రస్వామి జయంత్యుత్సవాలు



గంగాజలాన్ని ఊరేగింపుగా తీసుకొస్తున్న వీరశైవులు

కణేకల్లు: కణేకల్లులో వీరభద్రస్వామి జయంత్యుత్సవాలను వీరశైవులు మంగళవారం జరుపుకున్నారు. శివారులోని వేదవతి హగిరికి మహిళలు కలశాలతో ఊరేగింపుగా వెళ్లి గంగపూజ చేశారు. అనంతరం వేదవతి జలాలు తెచ్చి ఆలయంలో స్వామికి అభిషేకం చేశారు. వీరభద్రుడికి పంచామృతాభిషేకం, మంగళారతులిచ్చి, అష్టోత్తర నామావళిని పఠించారు.

ఈక్రాప్ బుకింగ్ గడువులోపు పూర్తి చేయాలి



వ్యవసాయసిబ్బందితో మాట్లాడుతున్న డీఏఓ ఉమామహేశ్వరమ్మ

విడపనకల్లు: ఈక్రాప్ బుకింగ్ గడువులోపు పూర్తి చేయాలని జిల్లా వ్యవసాయాధికారి ఉమామహేశ్వరమ్మ అధికారులను ఆదేశించారు. మంగళవారం మండలంలోని పాల్తూరు గ్రామంలో రైతు సేవా కేంద్రాలను ఆమె ఆకస్మికంగా తనిఖీ చేశారు. మండలంలోని ఈ క్రాపు బుకింగ్ వివరాలను వ్యవసాయాధికారులను అడిగి తెలుసుకున్నారు. ఈనెల 15వతేదీలోపు ఈ క్రాపు బుకింగ్ పూర్తి చేయాలని అధికారులను ఆదేశించారు. మండల వ్యాప్తంగా 19వేల ఎకరాల్లో కంది, మిరప, వరి పంటలను ఈక్రాప్ బుకింగ్ చేసినట్లు ఏఓ పెన్నయ్య డీఏఓకు వివరించారు. ఎంపీఈఓలు ముత్యాలు, మెర్సీ పాల్గొన్నారు.

నల్లబ్యాడ్జీలతో వైద్యుల నిరసన

రాయదుర్గంటౌన్: వైద్య విద్య పీజీలో సర్వీస్ కోటా రద్దు చేయడంపై నియోకవర్గంలోని 8 ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల్లో పనిచేసే వైద్యులు, సిబ్బంది నల్లబ్యాడ్జీలతో మంగళవారం విధులకు హాజరయ్యారు. ప్రభుత్వాస్పత్రుల్లో పనిచేసే వైద్యులు పోస్ట్ గ్రాడ్యుయేషన్ చేయడానికి గతంలో మొత్తం పీజీ సీట్లలో 30 సీట్లు డ్యూటీ వైద్యులకు కేటాయించే వారని, ప్రస్తుత ప్రభుత్వం ఈ కోటాను 15 శాతానికి తగ్గిస్తూ జీవో 85 జారీ చేయడంపై పీహెచ్‌సీ వైద్యులు ఆందోళన చేపట్టారు. ఈ నెల 16వ తేదీ వరకు ఆందోళనలు చేపడతామని వైద్యులు సందేశ్‌కుమార్ తెలిపారు.

కళ్యాణదుర్గం రూరల్: నియోజకవర్గం వ్యాప్తంగా ఉన్న డ్యాక్టర్లు నల్ల బ్యాడ్జీలు ధరించి, విధులకు మంగళవారం హాజరయ్యారు. డాక్టర్ రాజేష్ మాట్లాడుతూ 85 జీవోను వెంటనే రద్దు చేయాలని, అధికారులు, ప్రజాప్రతినిధులకు వినతులు ఇచ్చినా ఫలితంలేకపోయిందన్నారు.

మట్టి తరలిస్తే చర్యలు

రాయదుర్గంటౌన్: రాయదుర్గం పట్టణవాసుల దాహార్తి తీర్చే కణేకల్లులోని డాక్టర్ వైఎస్ రాజశేఖరరెడ్డి హెచ్చెల్సీ శాశ్వత తాగునీటి పథకం సమ్మర్ స్టోరేజీ ట్యాంకు (ఎస్ఎస్ ట్యాంక్) మట్టిని తరలిస్తే ఉపేక్షించేదిలేదని మున్సిపల్ కమిషనర్ దివాకర్‌రెడ్డి హెచ్చరించారు. కొందరు అక్రమార్కులు గత ఆదివారం ఎస్ఎస్ ట్యాంకు మట్టిని జేసీబీ, ట్రాక్టర్ల ద్వారా భారీగా తరలించిన విషయమై ఎలాంటి చర్యలు తీసుకున్నారని కమిషనర్‌ను అడగ్గా, ఆయన స్పందించారు.

పంటకోత ప్రయోగాలు పకడ్బందీగా చేయండి



మాట్లాడుతున్న డీఎస్ఓ సాంబశివుడు

వజ్రకరూరు:2024 ఖరీఫ్ సీజన్‌కు సంబంధించి పంట కోత ప్రయోగాలు పకడ్బందీగా చేయాలని డీఎస్ఓ సాంబశివుడు సూచించారు. మంగళవారం స్థానిక వ్యవసాయ కార్యాలయంలో ఏఓ మధుకర్ ఆధ్వర్యంలో రైతుసేవా కేంద్రం సిబ్బందికి శిక్షణ ఇచ్చారు. కార్యక్రమంలో ఏఎస్ఓ సుభాషిణి, ఏఈఓ జానమ్మ, ఎంపీఈఓలు, వీఏఏలు, వీహెచ్ఏలు తదితరులు పాల్గొన్నారు.

ఫిజికల్ డైరెక్టర్‌కు సన్మానం



కిరణ్‌కుమార్ దంపతులను సన్మానిస్తున్న దృశ్యం

కళ్యాణదుర్గం రూరల్: పట్టణంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల నార్త్‌స్కూల్‌లో ఫిజికల్ డైరెక్టర్‌గా పనిచేస్తున్న కిరణ్‌కుమార్ ఉత్తమ పీడీగా ఎంపికయ్యాడు. మంగళవారం ఆయన్ను ఉపాధ్యాయులు సన్మానించారు.

విరాళాల సేకరణ

రాయదుర్గంటౌన్: విజయవాడ వరద బాధితుల సహాయార్థం స్వయం సహాయక సంఘాల సభ్యులు రూ.1,21,200 విరాళం ప్రకటించారు. మెప్మా మిషన్ డైరెక్టర్ పేరిట విరాలం చెక్కును ఎమ్మెల్యే కాలవ శ్రీనివాసులుకు పొదుపు సంఘం మహిళలు మంగళవారం అందజేశారు. మెప్మా పట్టణ సమాఖ్య అధ్యక్షురాలు పార్వతి, టీపీఆర్ఓ సుబ్బరాయుడు, టీఎంసీ నారాయణరెడ్డి, సీఓలు సంధ్య, కిరణ్మయి, వెంకటలక్ష్మి, అబ్దుల్లా, సీఆర్‌పీలు పాల్గొన్నారు.

కళ్యాణదుర్గం రూరల్: వరద బాధితుల కోసం ఎస్వీజీఎం డిగ్రీ కళాశాల విద్యార్థులు పట్టణంలో విరాళాలు సేకరిస్తున్నారు. మంగళవారం పట్టణంలోని ఆర్టీసీ, ప్రైవేట్ బస్‌స్టాండ్‌లు, పెట్రోల్ బంక్‌లు ప్రధాన రహదారుల్లో విరాళాలు సేకరించారు. ఎన్ఎస్ఎస్ పీవో డాక్టర్ శ్రీధర్, డాక్టర్ రవిశంకర్, ఎన్ఎస్ఎస్ వలంటీర్లు పాల్గొన్నారు.

గుమ్మఘట్ట: విజయవాడ వరద బాధితుల కోసం మండలంలోని మారెంపల్లి ప్రభుత్వ పాఠశాల విద్యార్థులు, ఉపాధ్యాయులు విరాళాలు సేకరించారు. ఇంటింటికీ వెళ్లి రూ.4,360 సేకరించి సీఎం రిలీఫ్ ఫండ్‌కు పంపించినట్లు ఎంఈఓ నాగమణి, ప్రధానోపాధ్యాయులు తెలిపారు.

పీహెచ్‌సీల్లోనే గర్భిణులకు స్కానింగ్



పీహెచ్‌సీలో స్కానింగ్ మిషన్‌ను పరిశీలిస్తున్న డీఎంహెచ్‌ఓ భ్రమరాంబదేవి

బెళుగుప్ప: పీహెచ్‌సీల్లోనే గర్భిణులకు స్కానింగ్ పరీక్షలు నిర్వహించేలా చర్యలు తీసుకుంటున్నట్లు డీఎంహెచ్ఓ డాక్టర్ భ్రమరాంబదేవి తెలిపారు. బెళుగుప్ప పీహెచ్‌సీని మంగళవారం ఆమె తనిఖీ చేశారు. ఓపీపై ఆరా తీశారు. అనంతరం మీడియాతో మాట్లాడుతూ బెళుగుప్ప పీహెచ్‌సీలో గర్భిణుల సౌకర్యార్థం త్వరలో స్కానింగ్ సేవలను అందుబాటులోకి తీసుకువస్తున్నట్లు తెలిపారు. అనంతరం రూ.1.2 కోట్ల వ్యయంతో నిర్మించిన నూతన పీహెచ్‌సీ భవనాన్ని పరిశీలించారు. కార్యక్రమంలో డీఈఎంఓలు త్యాగరాజు, గంగాధర్, వైద్యాధికారులు కార్తీక్‌రెడ్డి, లోకేష్, ప్రియాంక, హెల్త్ సూపర్‌వైజర్ వెంకటరమణ పాల్గొన్నారు.

మదర్ థెరిసా జాతీయ అవార్డుకు తిమ్మారెడ్డి ఎంపిక



కళ్యాణదుర్గం రూరల్: పట్టణంలోని రఘువీరా ప్రాథమిక పాఠశాలలో ప్రధానోపాధ్యాయులుగా పని చేస్తున్న కంబాల తిమ్మారెడ్డి మదర్ థెరీసా జాతీయ అవార్డుకు ఎంపికయ్యారు. అవార్డును బెంగళూరుకు చెందిన సోమలరాజు ఫౌండేషన్ మదర్‌థెరీ సా జాతీయ అవార్డును మంగళవారం ప్రకటించింది. ఈఅవార్డును తిమ్మారెడ్డి బెంగళూరులో శనివారం అందుకోనున్నారు.

పరిసరాల పరిశుభ్రతతోనే ఆరోగ్యం

బొమ్మనహాళ్: గ్రామాల్లో పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని పీహెచ్‌సీ వైద్యాధికారిణి మల్లేశ్వరి అన్నారు. మంగళవారం ఉద్దేహాళ్ గ్రామంలో మలేరియా, డెంగీ, చికున్ గున్యా వ్యాధి లక్షణాలు, నివారణ చర్యలపై ర్యాలీ చేశారు.పీహెచ్ఎన్ చిలక మ్మ, ఆరోగ్య కార్యకర్త గోవర్ధన, జైనాబీ పాల్గొన్నారు.

సాక్షి దినపత్రికలో ప్రకటనల కోసం మీ ప్రాంతంలో మా ప్రతినిధులు అందుబాటులో ఉన్నారు.
వివాహ, జన్మదిన, పదవీ విరమణ శుభాకాంక్షలు
వ్యాపార, ఉద్యోగ, బహిరంగ ప్రకటనలు
శ్రద్ధాంజలి, నిర్యాణము, వర్ధంతి మొదలగు
అన్ని రకాల ప్రకటనలు ఇవ్వదలిచిన వారు సంప్రదించండి.
రాయదుర్గం డివిజన్
9912220732, 9010470185, 9010223701